## క్లుప్తంగా

### మజ్జిగ పంపిణీ



బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న సేనాపతి అప్పారావు, పాల్ విక్టర్

తాటిచెట్లపాలెం: కై లాసపురంలోని డాక్టర్ జోసఫ్స్ స్కూల్, గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక బాధ్యతలో భాగంగా పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి మాజీ కార్పొరేటర్ సేనాపతి అప్పారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ కాపరి బిషప్ గరికిముక్కుల పాల్ విక్టర్, గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### కుంచమాంబ పండగకు ఏర్పాట్లు



కుంచమాంబ అమ్మవారు

మద్రిపాలెం: మాధవధార గ్రామదేవత కుంచమాంబ అమ్మవారి పండగను జూలై 8న నిర్వహించనున్నట్టు మాధవ యువజన సమాజం సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఆదివారం పండగ నిర్వహణపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జూలై 7న తొల్లేళ్ల ఉత్సవ, 8న ప్రధాన పండగ, 15న అమ్మవారి మారువారం, 17న కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ, జూలై 20న నాడు శ్రీ కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాజం సభ్యులు, గ్రామ పెద్దలు చెప్పారు.

### సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ సమీర్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ సమీర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, తగాదాల జోలికి పోకూడదన్నారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ప్రతిక్షణం ఉంటుందని, నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు.

### ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామి

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల్లో భాగంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతపై ప్రవచనాలు అందించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివార్లను దర్శించుకున్నారు.

### యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కు 143 మంది హాజరు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 277 మంది అభ్యర్థు లకు 143 మంది హాజరయ్యారు. అభ్యర్థులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష హాల్‌లోకి పంపారు. అభ్యర్థులకు తగిన సౌకర్యాలు సమకూర్చారు.

# భళా.. బాల



పేపర్లతో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల అలంకరణ వస్తువులు

వేసవి శిబిరాల్లో కళాత్మకతను చాటిన చిన్నారులు
చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్, పెయింటింగ్ వంటి విభాగాల్లో విశేష ప్రతిభ
పుస్తక పఠనంపై ఆసక్తి



తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు



చిన్నారులు తయారు చేసిన కళాఖండాలు

మురళీనగర్: అవకాశమిస్తే చిన్నారులు తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తారు. కేవలం చదువులోనే కాదు.. పూర్తి స్వేచ్ఛనిస్తే చాలు.. తాము కూడా అనేక కళాఖండాలను సృష్టిస్తామని చాటుతున్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాలు వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ ద్వారా వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. దీంతో అనేక మంది విద్యార్థులు ఈ శిబిరాల్లో పాల్గొని తమలోని కళాత్మకతను చాటారు. చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్, పెయింటింగ్ వంటి అనేక విభాగాల్లో తమ ప్రతిభ చూపి భళా.. బాల అని అనిపించుకున్నారు.

**విభిన్న అంశాల్లో ప్రతిభ**

మురళీనగర్ బాలలు, మహిళల గ్రంథాలయంలో 20 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులు తమ విశేష ప్రతిభ చాటారు. ముఖ్యంగా పుస్తక పఠనంపై వీరు ఆసక్తి పెంచుకున్నారు. కథలు చదవడం, చెప్పడం, పద్యాలు పఠించడంతోపాటు తాము చదివిన అంశాలపై వేదికపై మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని సాధించారు. పేపర్ క్రాఫ్ట్ ద్వారా వివిధ రకాల అలంకరణ వస్తువులను తయారు చేశారు. పెయింటింగ్, చిత్రలేఖనంలో ప్రతిభను ప్రదర్శించారు. ఈ వేసవి శిబిరాలను తాము విజయవంతంగా వినియోగించుకున్నామని చిన్నారులు తెలిపారు. ఆటలు, పాటలతో ఈ వేసవి సెలవులను ఆనందంగా గడుపుతున్నారు.

**సృజనాత్మక ప్రదర్శనలు**

మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, పాట్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, సీడీ, శారీ పెయింటింగ్‌ల్లో శిక్షణ పొందారు. మౌల్డింగ్ ఆర్ట్‌లో వీరు తమ సృజనాత్మకతను ప్రదర్శించి కళారూపాలు తయారు చేసి ప్రదర్శించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన శిక్షణలో భగవద్గీత పఠనం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌సలో శిక్షణ పొందారు. ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో నిర్వహించిన శిక్షణ శిబిరంలో స్టెయిన్ వుడ్ మ్యూరల్ ఆర్ట్, ఓహెచ్‌పీ షీట్ ఆర్ట్, టార్టొయిస్ ఆర్ట్, 3డీ అవుట్ లైనర్ ఆర్ట్, వెజిటబుల్ పెయింటింగ్‌లో శిక్షణ ఇవ్వగా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు.



వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

## బాబోయ్ దుర్వాసన..!

రోత పుట్టిస్తున్న అన్న క్యాంటీన్ పరిసరాలు



రామాటాకీస్ రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద నిలిచిన మురుగు నీరు



అన్న క్యాంటీన్ వద్ద రోత పుట్టిస్తున్న డంపర్ బిన్ పరిసరాలు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని అన్న క్యాంటీన్ పరిసరాలు అపరిశుభ్రతతో రోత పుట్టిస్తున్నాయి. ప్రభుత్వ నేత్ర వైద్యశాల వద్దనున్న అన్న క్యాంటీన్ పక్కనే గల డంపర్ బిన్ పరిసరాలు చెత్తాచెదారంతో నిండి, మురుగు వాసన వెదజల్లడంతో అటుగా వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోజూ మూడు పూటలా ఇక్కడికి వచ్చే వారు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. డంపర్ బిన్ వద్ద మురుగు నిలిచిపోవడం, బహిరంగ మూత్ర విసర్జన, ఇష్టానుసారంగా చెత్త పడవేయడంతో ఆ ప్రాంతం దుర్వాసనతో రోత పుట్టిస్తోంది. ఇటువంటి పరిస్థితుల మధ్య అన్న క్యాంటీన్‌లో భోజనం కోసం ముక్కు మూసుకుని క్యూలు కట్టాల్సి వస్తోందని జనం వాపోతున్నారు. దుర్వాసనతో క్యాంటీన్‌లో ఆహారం తినలేకపోతున్నామని, ఒక వేళ తిన్నా బయటకు వచ్చాక వాంతి అయ్యే పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. డంపర్ బిన్ పరిసరాలను శుభ్రం చేయాలని, బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డంపర్ బిన్ వద్ద మురుగు నీరు, వర్షపు నీరు వెనుక ఉన్న గెడ్డలోకి పోయేలా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## హైవేపై ఆటోను ఢీకొట్టిన కారు

ఆరుగురికి గాయాలు,
ఆస్పత్రిలో చికిత్స



కారు ఢీకొట్టంతో దెబ్బతిన్న ఆటో

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.. అగనంపూడికి చెందిన భాస్కర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం పలాసలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బయలుదేరాడు. ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకునేందుకు వీరంతా ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అగనంపూడి నుంచి ఆటోలో వస్తున్నారు. తాటిచెట్లపాలెం సమీపంలో వారి ఆటోను రైల్వే న్యూకాలనీ రోడ్డు నుంచి వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కారు ఢీకొనడంతో ఆటో దెబ్బతింది. ఆటో డ్రైవర్ కె.కాశీరావు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉమామహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హృదయపూర్వక సమర్పణమే 'శ్రీకృష్ణ అర్పణం'



నృత్య ప్రదర్శనలో మురళీనగర్‌కు చెందిన కళాకారులు

తగరపువలస: శ్రీకృష్ణునికి హృదయపూర్వక సమర్పణ అందించే కార్యక్రమమే 'శ్రీ కృష్ణ అర్పణం' అని, అందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని అంబరీష దాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలోని శ్రీరాధా మదన్‌మోహనుల మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 వరకు శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమం కనులపండువగా జరిగింది. మురళీనగర్‌కు చెందిన శ్రీ సంజన కూచిపూడి నృత్యాలయం కళాకారులు సంగీతసేవ నిర్వహించారు. అంబరీష దాస మాట్లాడుతూ ప్రతి వారం ఈ ప్రత్యేకమైన శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా భక్తి కళాకారులచే సంగీత, నృత్య, సంప్రదాయ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీరాధా మోహనులకు ప్రత్యేక పూజలు చేశారు. జూన్ 1న జరిగే శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొనాలనుకునే కళాకారులు 95425 11108 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## సత్యసాయి సంస్థల సేవలు నిరుపమానం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్

ఉక్కునగరం: సత్యసాయి సంస్థల సేవలు నిరుపమానమని స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జీఎం చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఉక్కునగరం సత్యసాయి మందిరంలో 38వ సారి రక్తదాన శిబిరం నిర్వహించారు. అమ్మ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రక్తదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ శిబిరం ద్వారా సేకరించిన 68 యూనిట్లు రక్తంలో అమ్మ బ్లడ్ బ్యాంక్‌కు 36 యూనిట్లు, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్‌కు 32 యూనిట్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా సమన్వయకర్త ఆర్.ఎ. నాయుడు, జేసీఐ ప్రతినిధులు రవికుమార్, సత్యసాయి ప్రతినిధులు ఎస్.కె.ఆర్.కె. రాజు, కె.వి. రమణ, వి. కృష్ణ, కె. ప్రకాశ్, ఎస్.ఎం. విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం 33/11 కేవీ సెక్షన్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ, బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింహనగర్ రైతు బజార్ ఏరియా, విద్యుత్ నగర్, పోర్ట్ స్టేడియం ఈస్ట్ గేట్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

## అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత సత్యనారాయణకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మాధవధార ప్రాంతానికి చెందిన పి.ఉమా వెంకట సత్యనారాయణ లక్షా 5 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయ డొనేషన్ కౌంటర్లో ఇచ్చారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం ఏఈవో ఆనంద్‌కుమార్, పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్ అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.

## దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్



స్టేషన్‌లో అవగాహన ర్యాలీ చేస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం – 4లో స్వచ్ఛ భారత్, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్ఆర్‌సీసీ సభ్యుడు కుంచుమూర్తి ఈశ్వర్, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాల్లో ప్రయాణికులకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. దువ్వాడ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.జాషువా, బి.కామేశ్వర రావు, ఆర్.రవి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కె.వి.సుబ్బరాజు,విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, స్పందన చేయూత తదితర ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శాకంబరిగా ఎర్నిమాంబ



కాయగూరల అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం–అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి మారువారం జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో శాకాంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ ప్రత్యేకంగా అమ్మవారికి అలంకరణ చేశారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం వితరణ చేశారు. కార్యనిర్వహణాధికారి డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఆకట్టుకున్న 'అష్టలక్ష్మీ వైభవం'



కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో అష్టలక్ష్మీ వైభవం కూచిపూడి నృత్యాంశం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇంకా.. తెలుగు పద కవితా పితామహుడు అన్నమయ్య విరచిత ముద్దుగారే యశోదా.., గరుడ గమన, నారాయణతే నమోనమో తదితర కీర్తనలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చంద్రచూడ.., అయిగిరినందిని.., స్వాగతం కృష్ణా.., దీపా తారంగిని.., శంభో శంకర తదితర గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. గీతా మిత్ర నృత్య దర్శకత్వంలో కళాకారులు పవిత్ర, మోక్షజ్ఞ, లక్ష్మీ ప్రణతి, జాస్మిక వీటిని ప్రదర్శించారు.

## అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ



శ్రీనగర్‌లో వీటీ హైస్కూల్ వద్ద పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్త

సీతంపేట: వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయం సమీపంలోని వీటీ హైస్కూల్ కూడలిలో చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఇక్కడ చెల్లాచెదురుగా చెత్త ఉండటంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ డంపర్ బిన్ ఉన్నప్పటికీ దాని చుట్టూ చెత్త పెద్ద ఎత్తున పోగవుతోంది. చుట్టుపక్కల నివాసులు ఇక్కడ చెత్తను పడవేస్తున్నారు. నిత్యం ఇదే పరిస్థితి ఉంటోందని పలువురు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారిందని, చెత్త పేరుకుపోకుండా తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బీచ్‌లో మెరైన్ ఎస్ఐ పర్యటన



పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌ను ఆదివారం ఉదయం మెరైన్ పోలీసులు సందర్శించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నగరానికి రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు మెరైన్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీకృష్ణ పర్యాటకులు, మత్స్యకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భద్రత దృష్ట్యా ప్రతిరోజు ఎంతమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శిస్తున్నారు, మత్స్యకారుల పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాటు, బీచ్ పరిసరాల్లో స్థానికేతరుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు ఎవరైనా తీర ప్రాంతాల్లో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.